
సాక్షి వికారాబాద్

గురువారం । 24 । అక్టోబర్ । 2024



ఉన్నచోటే ఉపాధి

పెట్రో ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇథనాల్ తయారీ పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధమైంది. 8లో▸



పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



నమోదులో జాప్యం తగదు

పేదలకు ప్రభుత్వం అందించిన ఆహార భద్రత కార్డుల్లో కొత్త వారి పేర్ల నమోదుకు జాప్యం చేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఫిర్యాదుల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మోమిన్‌పేట: రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ వాసుచంద్రతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ.. ధరణి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే నంబర్‌లో విస్తీర్ణ వ్యత్యాసాలుంటే వెంటనే సరి చేసి ఉన్నతాధికారులకు పంపించాలన్నారు. ఏ రైతు పేరు మీద అదనపు విస్తీర్ణం ఉందో పరిశీలించి వాటిని తొలగించి రికార్డును సరిచేయాలని సూచించారు. పెండింగ్ మ్యుటేషన్, పేరు తప్పుగా నమోదు కావడం, విస్తీర్ణం హెచ్చు తగ్గులు ఉండడం వంటివి వెంటనే సరి చేయాలన్నారు. ఆన్‌లైన్ కాపీలతో జిరాక్స్ కాపీలను ఉన్నతాధికారులకు పంపించాలన్నారు. ఉద్యోగులు రైతులను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్ఐ గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

సమాజంలో పోలీసుల పాత్ర కీలకం

ఎస్పీ నారాయణరెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

బంట్వారం: సమాజంలో పోలీసుల పాత్ర కీలకమైనదని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన బంట్వారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలని పోలీసులకు సూచించారు. రోడ్డు ప్రమాదాలు, నేరాల సంఖ్య జిల్లాలో పూర్తిగా తగ్గిపోయాయన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు సీఐ రఘురాములు, స్థానిక ఎస్ఐ మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

చెట్లను నరికితే పీడీ యాక్ట్

ఎఫ్ఆర్ఓ రాజేందర్

యాలాల: ఉద్దేశపూర్వకంగా చెట్లను నరికి భూమిని చదును చేస్తే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఎఫ్ఆర్ఓ రాజేందర్ హెచ్చరించారు. మండల పరిధిలోని సంగాయిపల్లి తండా పరిసరాల్లో కొంతమంది కావాలనే చెట్లు నరుకుతున్నారని అటువంటి వారికి శిక్షత ప్పదన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్ట ప్రకారం రెండు విడతలుగా 60 మందికి హక్కు పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. అటవీ సంరక్షణలో భాగంగా విధులకు ఆటంకం కలిగించే వారిని జైలుకు పంపడం ఖాయమన్నారు. అటవీ సంరక్షణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

స్టాంప్ వెండర్‌కు మెమో

సాక్షి ఎఫెక్ట్..

తాండూరు: అధిక ధరలకు రెవెన్యూ స్టాంపులు విక్రయిస్తున్న స్టాంప్ వెండర్‌కు తాండూరు సబ్ రిజిస్ట్రార్ పుర్య మెమో జారీ చేశారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'దోపిడికి స్టాంప్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి తాండూరు సబ్ రిజిస్ట్రార్ స్పందించి ఓ స్టాంప్ వెండర్‌కు మెమో జారీ చేశారు. పట్టణంలో ఉన్న మిగిలిన స్టాంప్ వెండర్‌లు సైతం అధిక ధరలకు రెవెన్యూ స్టాంప్‌లను విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నప్పటికీ సబ్ రిజిస్ట్రార్ అధికారులు ఒకరికి మాత్రమే మెమో జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది. నిబంధనల ప్రకారం రెవెన్యూ స్టాంప్‌లను విక్రయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచితంగా మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ శిక్షణ

మొయినాబాద్: నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ మహిళలకు మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ శిక్షణ ఇవ్వనున్నట్లు దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం డీఎం శైలకుమారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిలుకూరులో ఉన్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో గ్రామీణ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు రెండు సంవత్సరాలపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్ చదివి ఆసక్తి ఉన్నవారు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్స్‌తోపాటు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో https//chfw.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కళేబరాలతో కల్తీ నూనె

మేడికొండ, దోర్నాల్ కల్తీ నూనె తయారీకి అడ్డాగా మారాయి. జంతువుల ఎముకలు, కొమ్ములు తదితర వ్యర్థాలను మరగబెట్టి ఆయిల్ తయారు చేస్తున్నారు. అధికారులు, నేతల అండదండలతో వీరి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు ఆయిల్ ట్యాంకర్లుగా కొనసాగుతోంది.



మేడికొండ సమీపంలోని బొక్కల ఫ్యాక్టరీలో నూనె తయారీకి మరిగిస్తున్న ఎముకలు

పూడూరు, ధారూరు మండలాల్లో దందా

- అక్రమార్కులకు అండగా నేతలు
- కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న అధికారులు
- దుర్వాసనతో రైతుల ఇబ్బందులు



ఫ్యాక్టరీలో గుట్టలుగా డంప్ చేసిన ఎముకలు

వికారాబాద్: కళ్లెదుటే కల్తీ జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. పూడూరు మండల పరిధిలోని మేడికొండ శివారులో ఓ ఫ్యాక్టరీ యజమానులు, ధారూరు మండలం దోర్నాల్ రెవెన్యూ పరిధిలో ఇలాంటి అక్రమదందాలు కొనసాగుతున్నాయి. జంతు కళేబరాలు సేకరించి వాటి ఎముకలతో నూనెలు తయారు చేసి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నారు. వీరికి కొందరి నేతల అండదండలుండడంతో ప్రశ్నించే వారి నోర్లు మూయిస్తున్నారు. వీరి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.

పదేళ్లుగా ఇబ్బందులు

పూడూరు మండల పరిధిలోని మేడికొండ శివారులో, ధారూరు మండలం దోర్నాల్‌లో పదేళ్ల క్రితం జంతు కళేబరాలతో నూనె తయారు చేసే ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. వాటి నుంచి వెలువడే దుర్వాసనతో చుట్టుపక్కల గ్రామాల వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పొలాల్లో పనులకు వెళ్లే రైతులు దుర్వాసన భరించలేక తలలు పట్టుకుంటున్నారు. రైతులు, స్థానిక ప్రజలు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఫిర్యాదుల పరంపర కొనసాగుతూనే ఉంది. ఫిర్యాదులు అందిన వెంటనే హడావుడి చేసే అధికారులు ఆ తదనంతరం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఫ్యాక్టరీల మామూళ్లకు అలవాటు పడిన అధికారులు చర్యలకు వెనుకాడుతున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

మళ్లీ దందా!

మూడేళ్లుగా ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుర్గంధం మరింత పెరిగింది. దీంతో రైతులు, గ్రామస్తులు, పలువురు నాయకులు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన అప్పటి కలెక్టర్ నిఖిల ఫ్యాక్టరీలను సీజ్ చేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారులు వెంటనే ఫ్యాక్టరీలను సీజ్ చేశారు. దీంతో ఆ ప్రాంత వాసులు ఊపిరి పీల్చుకున్నారు. కొద్ది రోజులకే మళ్లీ దందా పునఃప్రారంభించారు. దీంతో రైతులు ఫిర్యాదు చేసినా స్పందించేవారు కరువయ్యారు. ఈ వ్యవహారం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

నాటినుంచి అవస్థలే..

ఫ్యాక్టరీల ఏర్పాటు సమయంలోనే గ్రామస్తులు వ్యతిరేకించారు. ఎటువంటి కార్యకలాపాలు లేవంటూనే గుట్టుగా జంతు కళేబరాలతో నూనె తయారీ ప్రక్రియ ప్రారంభించారు. నాటి నుంచి రైతులు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. దుర్వాసన భరించలేక వారు కలెక్టర్ ఫిర్యాదు చేయగా ఫ్యాక్టరీని సీజ్ చేయించారు. ప్రశ్నించే రైతులను బెదిరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు

భూములు సస్యశ్యామలం

- 'కొడంగల్–నారాయణపేట' టెండర్ల ఆమోదంతో అన్నదాతల హర్షం
- రూ.4,350 కోట్ల అంచనా వ్యయంతో సాగు, తాగునీరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్


కొడంగల్: కొడంగల్–నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకం టెండర్లకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. రూ.4,350 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకం పనుల నిర్వహణకు ఆగస్టులో అధికారులు టెండర్లను ఆహ్వానించారు. మొదటి ప్యాకేజీ పనులను రాఘవ కన్‌స్ట్రక్షన్స్, రెండో ప్యాకేజీ పనులను మేఘా సంస్థ దక్కించుకుంది. ఎత్తిపోతల ద్వారా కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లోని భూములు సస్యశ్యామలం కానున్నాయి. 1.10లక్షల ఎకరాలకు సాగునీరు, 5.50లక్షల మందికి తాగునీరు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. 2014–2018 వరకు కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి ఈ పథకం అమలుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై పలుమార్లు ఒత్తిడి తెచ్చినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2024లో ఈ పథకానికి ప్రాణం పోశారు. పథకం అమలు కోసం ముందుగా రూ.2,945 కోట్లు అంచనా వేశారు. అయితే చెరువులను విస్తరించి నీటి నిల్వ సామర్థ్యం పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రిజర్వాయర్లను నిర్మించనున్నారు. అంచనా వ్యయాన్ని రెట్టింపు చేశారు. ప్రస్తుతం రూ.4,350 కోట్లకు పెంచారు. మూడు నియోజకవర్గాల్లో సాగు, తాగునీరు అందిచేందుకు పరిపాలనా అనుమతులు జారీ చేశారు.

చెరువుల ఆధునికీకరణకు చర్యలు

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మీదుగా కృష్ణానది ప్రవహిస్తూ తెలంగాణాలో నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోకి ప్రవేశిస్తుంది. కృష్ణానదిపై తెలంగాణలో జూరాలను తొలి ప్రాజెక్టుగా నిర్మించారు. జూరాల నుంచి నికర జలాలతో మూడు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు ఇవ్వాలని నిర్ణయించారు. బూత్‌పూర్ రిజర్వాయర్ నుంచి నాలుగు దశల్లో ఎత్తిపోతల ద్వారా సాగు నీరు సరఫరా చేయనున్నారు. ఊట్కూర్, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి దగ్గర రిజర్వాయర్లు నిర్మిస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఊట్కూర్, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి, లక్ష్మీపూర్, ఈర్లపల్లి, దౌల్తాబాద్, హస్నాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట చెరువులను కాకరవాణి ప్రాజెక్టును నింపి ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తారు. ఈ చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంచనున్నారు. చెరువులను ఆధునీకరించి సాగు విస్తీర్ణం పెంచడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఇప్పటికే ఆదేశించిన ముఖ్యమంత్రి

కొడంగల్ –నారాయణపేట ఎత్తిపోతల పథకం పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పురోగతిపై ప్రతీ నెల సమీక్ష నిర్వహించనున్నట్లు అధికారులకు వివరించారు. కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లోని సాగునీటి చెరువుల సామర్థ్యం రెట్టింపు చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి నిల్వ కెపాసిటీని పెంచి ఆయకట్టును విస్తరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు తగినట్లుగా అన్ని చెరువులను ఆధునికీకరించాలన్నారు. అన్ని చెరువుల్లో చేపల పెంపకానికి ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్‌లో చాపల మార్కెట్ ఏర్పాటు చేయడం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.



జూరాల ప్రాజెక్టు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

కాలుష్య నిర్మూలనకు కృషి

ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, బయోడీజిల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్

పరిగి: మానవుడి వికృత చేష్టలతో పర్యావరణం మలినమైపోతుందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, బయోడీజిల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, బయోడీజిల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు కాలుష్య నిర్మూలకు కృషి చేయాలన్నారు. టెక్నాలజీ పెరుగుతున్నా కొద్దీ జీవావరణం, జీవసత్వాలు, జీవజాతులు అంతు చిక్కని రోగాలతో జీవశ్చవంలా మారుతున్నాయన్నారు. పర్యావరణ కాలుష్య నివారకు ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. సీఎన్‌జీ ప్లాంట్ ఏర్పాటుకు ఈ సంస్థ ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సంస్థ ద్వారా పరిగిలో ఏర్పాటు చేయనున్న బయో ప్లాంట్ ద్వారా 200 మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌రెడ్డి, కృష్ణకాంత్, రాజశేఖర్, చారి తదితరులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం చూపండి

ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్



అధికారులతో సమావేశమైన కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: అటవీ, రెవెన్యూ భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. అటవీ, రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ సమస్యలను రికాన్సిలేషన్ చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా అసైన్‌మెంట్ రిజిస్టర్ ధ్రువీకరించుకుని పూర్తిస్థాయిలో రిపోర్టు ఇవ్వాలని అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఏడీ సర్వే ల్యాండ్ అధికారి రాంరెడ్డి, ఆర్డీఓ వాసుచంద్ర, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎంపీడీఓలను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లాలోని ఎంపీడీఓలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎంపీడీఓలకు, వైద్యాధికారులకు పలు సూచనలిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సివిల్ పనులు, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ తదితర సమస్యలేమైనా ఉంటే ఎస్టిమేషన్ పంపించాలన్నారు. వీల్ చైర్స్, పేషెంట్ వెయిటింగ్ ఏరియాలో కుర్చీలు, ఇతర ఫర్నిచర్ అవసరమున్నా చెప్పాలని కోరారు. ఎలక్ట్రిక్ రిపేర్లు ఉంటే వెంటనే చేయించాలన్నారు. పీహెచ్‌సీలకు అవసరమైన ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్స్, హాలోజన్ బల్బులు అవసరం ఉంటే డీఆర్‌డీఓ కార్యాలయం నుంచి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, డీఎంహెచ్ఓ పల్వాన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బయటి నుంచి గడిపెట్టి..

మూడిళ్లు లూటీ

- పర్యానాయక్ తండాలో దొంగల బీభత్సం
- ఐదు తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.60వేల నగదు తస్కరణ

బషీరాబాద్: ఓ తండాలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. అందరూ నిద్రించాక బయట నుంచి గడి పెట్టి మూడు ఇళ్లను లూటీ చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని పర్యాయనాయక్ తండాలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన పాండు నాయక్, అనూషబాయి దంపతులు ఉదయం ఇంటికి తాళం వేసి వికారాబాద్‌లోని కూతురు ఇంటికి వెళ్లారు. పాండునాయక్ తండ్రి గోప్యానాయక్ పక్కగదిలో పడుకున్నాడు. ఉదయం లేచే వరకు తలుపులు బయట నుంచి గడి పెట్టి ఉన్నాయి. చుట్టుపక్కల వారి వచ్చి చూడగా తాళం పగులగొట్టి బట్టలు, ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడేసి ఉండడం గమనించారు. ఇంట్లో ఉన్న ఇనుప పెట్టెను సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లి అందులో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు రూ.20వేల నగదు దోచుకుని పెట్టెను అక్కడే వదిలేశారు. గోపాల్ నాయక్ దంపతులు ఇంటికి తాళం వేసి పక్కగదిలో నిద్రించారు. వారి గదికి బయట నుంచి గడిపెట్టి తాళం వేసిన ఇంట్లో చొరబడి బీరువాలోని రూ.40 వేల నగదు, ఇత్తడి సామగ్రి ఎత్తుకెళ్లారు. రాందాస్ ఇంట్లో ఆయన కుమారుడు రాహుల్ సెల్‌ఫోన్‌ను అపహరించారు. తండాలోని కిషన్‌నాయక్, మన్యానాయక్‌తో పాటు మరికొందరు ఇళ్లకు సైతం గడిపెట్టారని తండావాసులు తెలిపారు. సమాచారం అందుకున్న బషీరాబాద్ ఎస్ఐ గఫార్ బుధవారం తన సిబ్బందితో కలిసి తండాకు చేరుకున్నారు. తాండూరు సర్కిల్ నుంచి ప్రత్యేక పోలీసు బృందం, వికారాబాద్ నుంచి క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి చోరీ తీరును పరిశీలించారు. బాధితుల వివరాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తండావాసులు ఆందోళన చెందొద్దన్నారు. మండల వ్యాప్తంగా రాత్రివేళ గస్తీ పెంచామన్నారు. చోరీ ఘటనపై పోలీసు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. త్వరలోనే కేసును ఛేదించి దొంగలను పట్టుకుంటామన్నారు.



ఓ ఇంట్లో బీరువాలోని సామగ్రిని చిందరవందరగా పడేసిన దొంగలు



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులతో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

బాలికా విద్యతోనే భవిష్యత్

షీటీం అవగాహన సమావేశంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు: బాలికలు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం తాండూరు పట్టణ శివారులోని జ్యోతిబాపూలే గురుకుల బాలికల విద్యాలయంలో షీటీంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. బాలిక విద్యతోనే భవిష్యత్ సమాజంలో మార్పు సాధ్యమవుతుందని చెప్పారు. తల్లిదండ్రులు బాలికలను చదివించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. బాలికల రక్షణకు పోలీసుశాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. బాలికలకు ఎటువంటి సమస్యలు వచ్చినా షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆపద సమయంలో 100, 181, 1930 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ బృందంతో పాటు గురుకుల విద్యాలయ ఉపాధ్యాయబృందం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫారెస్ట్ భూమిని ఆక్రమించిన ఇద్దరిపై కేసు

ధారూరు: రిజర్వ్‌డ్ ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ 95లోని ఎకరా స్థలాన్ని ఆక్రమించి, విత్తనం వేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. గట్టెపల్లితండాకు చెందిన నరేశ్, మల్లేశ్ రాంపూర్‌తండా గేట్ వద్ద అటవీ భూమిని ఆక్రమించి వేరుశనగ సాగు చేశారని తెలిపారు. ఈ స్థలంలో గతంలో అటవీశాఖ నాటిన మొక్కలను ధ్వంసం చేశారన్నారు. ఈ విషయమై ఫారెస్ట్ అధికారులు విచారణ చేపట్టగా.. మరోసారి భూమి జోలికి వెళ్లబోమని ఇరువురూ లిఖితపూర్వంగా తెలియజేశారన్నారు. ఇటీవల మళ్లీ భూమిని దున్ని పంట వేశారని డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ జె.హేమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మిషన్ భగీరథ నీటిని తాగండి

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఆంజనేయులు



మాట్లాడుతున్న ఆంజనేయులు

పెద్దేముల్: గ్రామాల్లో ప్రజలు మిషన్ భగీరథ నీటిని తాగే విధంగా సిబ్బంది చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల్లోని తాగునీటి సహాయకులకు మిషన్ భగీరథపై నాలుగో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సరఫరాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందేలా చూడాలని సిబ్బందిని కోరారు. నీటిపై ప్రజాల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జర్నప్ప, ఎంపీఓ రతన్‌సింగ్, ఏఈలు అఖిల్, ప్రతిభ తదితరులు ఉన్నారు.

పాతకక్షలతో దాడి చేసిన వ్యక్తుల రిమాండ్

కుల్కచర్ల: పాతకక్షల నేపథ్యంలో ఒక కుటుంబం మూకుమ్మడిగా కర్రలు, ఇనుప రాడ్లుతో దాడులకు పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని అంతారం గ్రామానికి చెందిన ఏడుగురు ఒక ఇంటిపై దాడిచేసి సంగతి విదితమే. మంగళవారం వారిపై కేసులు నమోదు చేయగా బుధవారం అరెస్ట్ చేసి వికారాబాద్ కోర్టులో హాజరు పరిచి పరిగి సబ్ జైలుకు తరలించారు. రిమాండ్‌కు తరలించిన వారిలో బసయ్య, రాములు, చెన్నయ్య, అనిల్, శ్రీను, నర్సింలు, తిరుపతయ్యలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఎవరూ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా న్యాయపరంగా ముందుకువెళ్లాలి తప్పిస్తే దాడులకు పాల్పడ వద్దని సూచించారు.

అంబేడ్కర్ భవన స్థలాన్ని కాపాడండి



మహేశ్వరం ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు

కందుకూరు: తమ సంఘానికి కేటాయించిన స్థలాన్ని ఇతరులు కబ్జా చేసి, ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని బాచుపల్లికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు బుధవారం మహేశ్వరం ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2007లో స్థానిక ఇందిరమ్మ కాలనీలో అంబేడ్కర్ భవనం కోసం 800 గజాల స్థలాన్ని కేటాయించారన్నారు. అందులో 460 గజాల్లో భవన నిర్మాణానికి 2011లో రూ.4 లక్షలు, 2021లో రూ.10 లక్షలు అప్పటి ప్రభుత్వాలు మంజూరు చేశాయి. దీంతో పనులకు శంకుస్థాపన చేసినా, నిర్మాణాన్ని ప్రారంభించలేదన్నారు. ఈ స్థలంలో ప్రస్తుతం కొంతమంది ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని స్పష్టంచేశారు. ఇదేమని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. స్థలాన్ని కాపాడాలని కోరారు.

ఉన్నచోటే ఉపాధి

- ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీలో స్థానికులకే ప్రాధాన్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు
- కంపెనీలో ప్రారంభమైన ఇథనాల్ తయారీ
- నిత్యం 1.20 లక్షల లీటర్ల ఉత్పత్తి



ఆర్‌బీఎల్ పరిశ్రమలో ఇథనాల్ ప్లాంట్

తాండూరు: పెట్రో ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇథనాల్ తయారీ పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధమైంది. ఇవి అందుబాటులోకి వస్తే పెట్రో ధరలు తగ్గే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే యాలాల మండలం జక్కెపల్లి గ్రామ శివారులో ఉన్న ఆర్‌బీఎల్(ర్యాడికల్ బయో ఆర్గానిక్స్ లిమిటెడ్) పరిశ్రమ స్థానిక నిరుద్యోగులకు వరంగా మారింది. ఇందులో ఇథనాల్ తయారీకి అనుమతులు రావడంతో రూ.150 కోట్లతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి గత నెలలో ఉత్పత్తిని మొదలు పెట్టారు. దీంతో పరిశ్రమలో పని చేసే 200 మందిని పర్మినెంట్ ఉద్యోగస్తులుగా గుర్తించారు. కార్మిక శాఖ నిబంధనల ప్రకారం వారికి ఉద్యోగ భద్రతతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్, ఆరోగ్య బీమాలు వర్తిస్తున్నాయి. పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 200 మంది కుటుంబాలకు ఉపాధి లభించగా, పరోక్షంగా 500 కుటుంబాల వరకు లబ్ధి చేకూరుతుంది. నిత్యం పరిశ్రమకు లోడింగ్ అన్‌లోడింగ్ కోసం 30 ట్రక్కుల సరుకు రవాణా జరుగుతుండగా స్థానికంగా మార్కెట్ వ్యవస్థ ఏర్పడింది.

నెల రోజులుగా ఉత్పత్తులు

జక్కెపల్లి గ్రామ శివారులో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డితో పాటు కొందరు కలిసి 2010లో ఆర్‌బీఎల్ పరిశ్రమను రూ.270 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారు. మొదటగా ప్రతి రోజు 60 వేల లీటర్ల సామర్థ్యంతో యూనిట్ నెలకొల్పారు. తర్వాత లిక్కర్ ఉత్పత్తికి డిమాండ్ పెరగడంతో 2018లో 80 వేల లీటర్లకు పెంచారు. మరోవైపు నెల రోజుల క్రితం పెట్రో ఉత్పత్తులకు వినియోగించే ఇథనాల్‌కి అనుమతులు రావడంతో.. రూ.150 కోట్ల వ్యయం కంపెనీని విస్తరించారు. నిత్యం 1.20 లక్షల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి అయ్యేలా ప్లాంట్ అందుబాటులోకి వచ్చింది. ఈ ప్లాంట్ ద్వారా ఇప్పటివరకు 20 లక్షల లీటర్లకు పైగా ఇంధనాన్ని ఉత్పత్తి చేసి ఆయిల్ మార్కెటింగ్ సంస్థ ద్వారా బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ పెట్రోలియం సంస్థలకు రవాణా చేస్తున్నారు.

అనుమానంగా వెళ్లా..



ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న సమయంలో ఆర్‌బీఎల్‌లో ఖాళీ ఉందని తెలిసింది. స్థానికులకు ఉద్యోగం ఇస్తారో లేదో అనే అనుమానంతో 2016లో పరిశ్రమకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నా. వారం రోజుల తర్వాత పిలుపు వచ్చింది. ప్రస్తుతం అసిస్టెంట్ పర్చేస్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నా.

– శివశంకర్, అసిస్టెంట్ పర్చేస్ మేనేజర్, ఆర్‌బీఎల్

కుటుంబంతోనే ఉంటున్నా



మాది పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామం. చదువు పూర్తయ్యాక ఉద్యోగం కోసం చాలా చోట్ల తిరిగా. ఎక్కడా అవకాశం రాలేదు. ఆర్‌బీఎల్‌లో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని సంప్రదించా. వెంటనే ఉద్యోగం ఇచ్చారు. 11 ఏళ్లుగా కుటుంబంతో ఉంటూ ఉపాధి పొందుతున్నా.

– శ్రీనివాస్, ఆర్‌బీఎల్ ఉద్యోగి, నాగులపల్లి

ఎనభై శాతం స్థానికులకే..



ఆర్‌బీఎల్ పరిశ్రమలో 80 శాతం స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాం. 2010లో ఏర్పాటు చేసిన పరిశ్రమలో లిక్కర్ తయారు చేశాం. తర్వాత పెట్రో ఉత్పత్తులను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ తయారీ కోసం అనుమతులు ఇచ్చింది. ఉత్పత్తులతో రూ. 360 కోట్ల టర్నోవర్ ఉంది.

– శ్రీనివాస్‌రెడ్డి, సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆర్‌బీఎల్

పొలాల దారిని రక్షించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిరిగిరిపేట్ గ్రామస్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని సిరిగిరిపేట్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ తారాసింగ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. సర్వేనంబర్ 109లో 26 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సదరు భూమిని వేలం వేసి విక్రయించారన్నారు. ప్రభుత్వ భూమిలో శ్మశాన వాటికలతో పాటు పొలాలకు వేళ్లే రోడ్డు ఉందన్నారు. ఆ భూమిని కబ్జా చేస్తే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. కావున అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. అంతకుముందు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బిచ్చిరెడ్డి, భద్రు, నర్సింలు, పరుశురాం, శివప్ప, పప్పి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం



అనిల్ (ఫైల్)

బంట్వారం: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఇంట్లోంచి బయటికి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగవరం తండాలో చోటు చేసుకుంది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కె.అనిల్‌కుమార్(23)కు మతిస్థిమితం లేదు. ఆయన ఈ నెల 19న ఇంట్లోంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు బంధువుల దగ్గర, పరిసర ప్రాంతాల్లో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో తల్లి రాణిబాయి బంట్వారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యూపీ కార్మికుడి మృతి

ఇబ్రహీంపట్నం: అనుమానాస్పద స్థితిలో ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అనిల్‌సింగ్(46) ఐదు నెలల క్రితం వినోభానగర్ సమీపంలోని వైట్ గోల్డ్ కంపెనీలో పనికి కుదిరాడు. బుధవారం నిద్ర లేవకపోవడంతో తోటి కార్మికులు వెళ్లి లేపేందుకు ప్రయత్నించారు. ఉలుకుపలుకు లేకపోవడంతో వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

- భవన నిర్మాణ కార్మికులకు థంబ్ విధానాన్ని రద్దు చేయాలి
- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి

మొయినాబాద్ రూరల్: రాష్ట్రంలో భవన నిర్మాణ రంగ కార్మికులకు థంబ్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణరంగ కార్మికుల సమావేశాన్ని ఏఐటీయూసీ మండల నిర్మాణ అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. లేబర్ అడ్డాల వద్ద కనీసం వసతులైన తాగు నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అడ్డాలపై నిలుచుంటున్న వారిని కూర్చునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగ కార్మికుల నూతన కమిటీ నిర్వహించడం అభినందనీయమన్నారు. అధ్యక్షుడిగా కె.దర్శన్, గౌరవ అధ్యక్షుడిగా బి.ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శి కురుమయ్య, కోశాధికారి నాగరాజు, పది మందితో సభ్యులను నియమించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, ఓబీసీ ఉపాధ్యక్షుడు బి.ప్రభాకర్, నాయకులు వెంకటయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఊరెళ్దామని.. వేరే బస్సెక్కి

పాఠశాలలో అదృశ్యమైన విద్యార్థి ఉప్పల్‌లో ప్రత్యక్షం



నితిన్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన విద్యార్థి ఉప్పల్‌లో ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన గడ్డం నితిన్(14) స్థానిక గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం నుంచి పాఠశాలలో కనిపించకుండా పోయాడు. వెంటనే ప్రిన్సిపాల్ వరూధిని తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పలుచోట్ల గాలించారు. అదృశ్యమైన విద్యార్థి ఉప్పల్‌లో ఉన్నట్లు అదేరోజు రాత్రి పోలీసులకు సమాచారం వచ్చింది. కాగా స్వగ్రామానికి వేళ్లేందుకు స్థానిక బస్టాండ్‌కు వచ్చి యాచారం వెళ్లే బస్సుకు బదులుగా ఉప్పల్ బస్సు ఎక్కినట్లు నితిన్ పోలీసులకు తెలిపారు. బాలుడికి కౌన్సెలింగ్ నిర్వహించి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వరూధిని సమక్షంలో తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు.

రుణాలతో ఆర్థికపుష్టి సాధించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

డీపీఎం వీరయ్య

మోమిన్‌పేట: బ్యాంకుల నుంచి తీసుకొంటున్న రుణాలను డ్వాక్రా మహిళలు ఆదాయ మార్గంగా మలుచుకోవాలని డీపీఎం వీరయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల మహిళ సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ సభ్యులు బ్యాంకుల నుంచి అధిక మొత్తంలో రుణాలు తీసుకొంటున్నారన్నారు. వాటితో రోజు ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఒక్కో సంఘానికి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారన్నారు. దీంతో పాటు స్త్రీనిధి ద్వారా రుణాలు అందుతున్నాయన్నారు. సంఘ సభ్యులు ఆర్థికంగా పరిపుష్టి చెందినప్పుడే కుటుంబాలు కూడా బలపడుతాయన్నారు. తీసుకొన్న రుణాలను తిరిగి బ్యాంకుకు చెల్లించడంలో జాప్యం జరిగితే వెంటనే గ్రామ సమాఖ్య సభ్యులు పర్యవేక్షించాలన్నారు. సంఘాల పుస్తకాలను ప్రతి నెల రాయాలని సూచించారు. మండల సమాఖ్య సభ్యులు గ్రామ సమాఖ్యలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, ఏపీఎం రాజు, సీసీలు, గ్రామ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతానికి కృషి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ హరిలాల్ తదితరులు

బొంరాస్‌పేట: ప్రభుత్వ బడులను మరింత బలోపేతం చేయాలని మండల విద్యాధికారి హరిలాల్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని రేగడిమైలారం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒకే ఆవరణలో ఉన్న ఈ పాఠశాలలు, తరగతి గదుల నిర్వహణ, విద్యాబోధన, సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీశారు. నూతన ఉపాధ్యాయులు విద్యాబోధనను సంపూర్ణంగా అందించాలన్నారు. బోధన పద్ధతులన్నింటిని పాటించాలని సూచించారు. అనంతరం పాఠశాలల హెచ్‌ఎంలు మల్లేశం, శంకరయ్య, ఉపాధ్యాయులు ఎంఈఓ హరిలాల్, క్లస్టర్ హెచ్‌ఎం రవీందర్‌గౌడ్‌లకు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం



మండల వైద్యాధికారి వాజుద్దీన్‌ని ప్రశ్నిస్తున్న నేతలు

- సమయపాలన పాటించకపోవడం సరికాదు
- కుల్కచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారిపై పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి ఆగ్రహం

కుల్కచర్ల: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి హెచ్చరించారు. బుధవారం వారు మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఆ సమయంలో వైద్యాధికారి లేరు. దీంతో వారు సిబ్బందితో మాట్లాడగా వారానికి ఒకటి, రెండు రోజులు మాత్రమే వస్తారని చెప్పారు. మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రికి వచ్చిన డాక్టర్ వాజుద్దీన్‌తో మాట్లాడి పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రి వారు కేన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేసినా ప్రభుత్వ వైద్యాధికారి లేకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 44 పంచాయతీలకు ఒకే ఆస్పత్రి ఉన్నది. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసే వారే విధుల్లో ఉండాలని.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. సాయంత్రం నుంచి వైద్యులు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలున్నాయని సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు.

భార్యతో గొడవపడి వ్యక్తి అదృశ్యం



షేక్ ఎజాజ్ (ఫైల్)

పహాడీషరీఫ్: భార్యతో గొడవపడిన వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై షేక్ యూసుఫ్ జానీ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్ తయ్యబా కాలనీకి చెందిన షేక్ ఎజాజ్(45)కు నజ్మాబేగంతో 14 ఏళ్ల క్రితం వివాహం జరగగా ఆరుగురు పిల్లలు సంతానం. కాగా ఇటీవల ఎజాజ్ మరో మహిళతో వివాహేతర సంబంధాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య అతన్ని ఈ నెల 21న ప్రశ్నించింది. దీంతో తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే వదిలేసిన ఎజాజ్ ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. ఎంతకి తిరిగి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం



బషీరాబాద్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



యాలాల: ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు

- అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తాం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అతి తక్కువ కాలంలో రూ.220 కోట్లు సాధించామన్నారు. బుధవారం బషీరాబాద్ మండలంలోని మైల్వార్ గ్రామంలో రూ.మూడు లక్షల డీఎంఎఫ్టీ నిధులతో చేపట్టిన బస్టాండ్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే రెండేళ్లలో నియోకవర్గంలోని అన్నీ రోడ్లు పూర్తి చేస్తామని అన్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు బీటీ రోడ్లు నిర్మిస్తామన్నారు. త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పారు. మైల్వార్ గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, అజయ్‌ప్రసాద్, బషీరాబాద్, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు మాధవరెడ్డి, బాల్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, రామ్‌నాయక్, నర్సింలు, రోహిత్ మల్క్యాడ్, చందర్‌నాయక్, బిచ్చిరెడ్డి, నరేందర్, ఖలీద్, శ్రావణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

హాజీపూర్ గ్రామాభివృద్ధి నా బాధ్యత

యాలాల: హాజీపూర్ గ్రామాభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామ బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్, పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమి లేదన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో వికారాబాద్–తాండూరు రోడ్డును చూసి స్థానిక యువకులకు పిల్లనివ్వలేని పరిస్థితి ఉండేదన్నారు. తాను గెలిచాక పట్టుబట్టి మరీ తాండూరు–వికారాబాద్ రోడ్డుకు నిధులు తీసుకు వచ్చానన్నారు. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.230 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, డైరెక్టర్లు రాజు, మొగులయ్య, నర్సింహులుగౌడ్, నాయకులు భీమప్ప, అక్బర్‌బాబా, హన్మంతు, మధుసూదన్‌రెడ్డి, వీరేశం, రఘురాంరెడ్డి, ఖాసీం, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

గ్రామీణ ప్రాంతమైన యాలాల మండలంలో రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన ఓ కార్యక్రమ అనంతరం విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్(సీఆర్‌ఆర్)లో భాగంగా రోడ్ల నిర్మాణానికి రూ.15.12 కోట్లు మంజూరు చేశామన్నారు. పేర్కంపల్లి–పేర్కంపల్లితండా(0.80 కి.మీ)రూ.56 లక్షలు, దౌలాపూర్–అక్కంపల్లి(2.10 కి.మీ) రూ.1.47 కోట్లు, రేళ్లగడ్డతండా–ఆశన్నకుంట తండా(0.60 కి.మీ)రూ.42 లక్షలు, నాగసముందర్–దేవనూరు(2.4 కి.మీ) రూ.1.68 కోట్లు, పేర్కంపల్లితండా–పగిడిపల్లి(2.96 కి.మీ) రూ.2.7 కోట్లు, బండమీదిపల్లి గేటు నుంచి విఠలేశ్వర గుడి వరకు (3.50 కి.మీ) రూ.2.45 కోట్లు, రుక్మాపూర్–బిజ్వారం–అడాల్‌పూర్(1.45 కి.మీ)రూ.1.45 కోట్లు, కోకట్–సంగెంకుర్దు(3.40 కి.మీ) రూ.2.38 కోట్లు, బిజ్వార్–అడాల్‌పూర్(3.40 కి.మీ)రూ.2.38 కోట్లు మంజూరు చేశామన్నారు.

10 ఏళ్ల జైలు.. రూ.23 వేల జరిమానా

- వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి న్యాయస్థానం శిక్ష
- తీర్పు వెల్లడించిన తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి హరీష

షాద్‌నగర్ రూరల్: మద్యం తాగి, అజాగ్రత్తగా వాహనం నడపడంతో పాటు ఒకరి మృతికి కారణమైన నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ బుధవారం న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ విజయకుమార్ వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన బోడంపాటి గోవర్ధన్‌గౌడ్ 2021 ఏప్రిల్ 21న సొంత పనిపై షాద్‌నగర్‌కు వచ్చాడు. పని ముగించుకుని, సాయంత్రం సమయంలో ప్యాసింజర్ ఆటోలో ఇంటికి బయలుదేరాడు. అప్పటికే మద్యం తాగి ఉన్న డ్రైవర్ కావలి శ్రీనివాసులు అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడిపాడు. నాగులపల్లి శివారులోని భారతి స్కూల్ సమీపంలోకి రాగానే అదుపు తప్పిన ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గోవర్ధన్‌గౌడ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మరణించాడు. ఇందుకు కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ మృతుని సోదరుడు కృష్ణయ్యగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అన్ని ఆధారాలు సేకరించి, కోర్టులో ప్రవేశపెట్టారు. వీటిని పరిశీలించిన 9వ అదనపు జిల్లా జడ్జి హరీష సాక్ష్యులను విచారించారు. డ్రైవర్ మద్యం తాగి నేరం రుజువు కావడంతో శ్రీనివాసులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.23 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. ఈ కేసు ఛేదనలో తోడ్పాటును అందించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోసులు సిబ్బందికి సీఐ విజయకుమార్ అభినందనలు తెలియజేశారు.